ప్రజాశక్తి
శుక్రవారం 1 ఆగస్టు 2025 5 అనంతపురం





సదస్సులో మాట్లాడుతున్న వి.రాంభూపాల్

ఎస్ఐఆర్‌తో ప్రజాస్వామ్యానికి ప్రమాదం

◆ ఓట్ల తొలగింపే లక్ష్యంగా బిజెపి కుట్ర
◆ దొడ్డిదారిన చేపట్టిన పౌరసత్వ చట్ట సవరణ నమోదును ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలి
◆ సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కేంద్ర ప్రభుత్వం ఎన్నికల కమిషన్ ద్వారా బీహార్ రాష్ట్రంలో దొడ్డిదారిన చేపట్టిన ఓటర్ల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్) దేశంలో ఎన్నికల పార్లమెంట్ ప్రజాస్వామ్య వ్యవస్థ మనుగడకే ప్రమాదం అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్, మానవ హక్కుల వేదిక నాయకులు చంద్రశేఖర్ తెలియజేశారు. బీహార్ రాష్ట్రంలో చేపడుతున్న ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణను వ్యతిరేకిస్తూ సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో గురువారం నగరంలోని ఎన్జీవో హోంలో సదస్సు నిర్వహించారు. సిపిఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాంభూపాల్, చంద్రశేఖర్ ముఖ్యఅతిథిలుగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల స్పెషల్ ఇంటెన్సీవ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రజాస్వామ్య వ్యవస్థకు తీవ్ర ప్రమాదం అవుతుందని తెలిపారు. పౌరుల ఓటు హక్కును ప్రశ్నించే నిబంధనలు ఇందులో ఉన్నాయన్నారు. స్వతంత్రంగా వ్యవహరించాల్సిన రాజ్యాంగ వ్యవస్థ ఎన్నికల సంఘం అన్నారు. ఇందుకు భిన్నంగా కేంద్ర హోం శాఖ మంత్రి ఆదేశాలతో ఓటరు జాబితాలను మార్చేసి లక్షలాది మందికి ఓటు హక్కు నిరాకరించి బిజెపికి రాజకీయ లబ్ధి చేకూర్చాలన్న కుట్ర జరుగుతోందన్నారు. రెండు నెలల్లో ఎన్నికల జరగబోతున్న బీహార్‌లో ఈ ప్రత్యేక సునిసిత అంశాన్ని తీసుకుని ఆ రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అధికారాన్ని నిలబెట్టుకోవడం కోసం కుట్రలు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది బిజెపి, ఆర్ఎస్ఎస్ మతతత్వ ఎజెండా అమలులో కీలక పరిణామం అన్నారు. ఎస్ఐఆర్ బీహార్‌కు మాత్రమే పరిమితం కాదని, దేశమంతా అమలు చేస్తామని కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించడం దారుణం అన్నారు. గత నాలుగు సంవత్సరాల క్రితం దేశవ్యాప్తంగా ప్రజలు తిరస్కరించిన పౌరసత్వ చట్ట సవరణ(సీఏఏ) జాతీయ పౌరసత్వ రిజిస్టర్ (ఎన్ఆర్సి) చట్టాలను ఎస్ఐఆర్ పేరుతో దొడ్డిదారిని అమలు చేయడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధమైందని విమర్శించారు. ఇందుకు కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆయుధంగా చేసుకుని బిజెపి మతతత్వ అజెండాను అమలు చేస్తున్న ఎస్ఐఆర్ ప్రజలందరూ వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. బీహార్‌లో దాదాపు 30 లక్షల మంది వలస కార్మికులు ఓటర్ల జాబితాను తొలగించాలని నోటీసులు ఇవ్వడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. మైనార్టీలను లక్ష్యంగా చేసుకుని విదేశీయుల పేరుతో ఓట్లు తొలగించే కుట్ర సాగుతుందన్నారు. పౌరులందరికీ సమాన అవకాశాలు కల్పిస్తూ స్వేచ్ఛాయుతమైన వాతావరణంలో నిష్పక్షపాతంగా పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించడం ఎన్నికల సంఘం బాధ్యత అన్నారు. ఆ బాధ్యత నుంచి ఎన్నికల సంఘం తప్పుకునేలా ప్రవర్తించడం సరికాదన్నారు. ఓటరు నమోదుకు పౌరసత్వంతో ముడి పెట్టరాదని తెలుగుదేశం తమ అభిప్రాయాన్ని ఎన్నికల సంఘం ముందు వ్యక్తం చేసిందన్నారు. ఈ విషయంలో రాష్ట్రంలోని వైసిపి బిజెపిని బలపరిచే వైఖరి తీసుకోవడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి వి.రామి రెడ్డి, లాయర్స్ అసోసియేషన్ నాయకులు సతీష్, ఎంఎం రాష్ట్ర అధ్యక్షులు మహబూబ్ బాషా, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చంద్రశేఖర్ రెడ్డి, నగర కార్యదర్శి వర్గ సభ్యులు ప్రకాష్, వెంకటనారాయణ, ఇర్ఫాన్, వలీ, మసూద్ నగర కమిటీ సభ్యులు రాజు, లక్ష్మీనారాయణ, ఎర్రిస్వామి, రామాంజినమ్మ, లక్ష్మీనరసమ్మ, తిరుమలేష్, బిహెచ్.రాయుడు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పరమేష్, మానవ హక్కుల సంఘం నాయకులు జాకీర్, ఐఎంఎం బాషా, అమాద్మీ పార్టీ నాయకులు మసూద్ పాల్గొన్నారు.

ఎట్టకేలకు అన్నదాత సుఖీభవ

◆ రేపు రైతుల ఖాతాల్లో జమ ◆ అనంతలో 2.74 లక్షల మందికి రూ.191.9 కోట్ల లబ్ధి

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఎట్టకేలకు రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అన్నదాత సుఖీభవ పథకం అమలకు సిద్ధమైంది. శనివారం నాడు రైతుల ఖాతాల్లో జమ చేసేందుకు శ్రీకారం చుట్టింది. పల్నాడు జిల్లాలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ పథకాన్ని ప్రారంభించనున్నారు. అదేరోజు అన్ని చోట్ల రైతుల ఖాతాల్లోకి డబ్బులు వేసేందుకు ఏర్పాట్లు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మూడు విడతల్లో అన్నదాత సుఖీభవ ఇవ్వనుంది. మొదటి విడత కింద కేంద్ర ప్రభుత్వం ఇచ్చే రెండు వేల రూపాయల వాటాతో కలిపి రాష్ట్ర ప్రభుత్వం ఐదు వేలు ఇవ్వనుంది. మొత్తంగా ఏడు వేల రూపాయలు రైతుల ఖాతాల్లో జమవనున్నాయి.

2.74 లక్షల మంది అర్హులు

అనంతపురం జిల్లాలో 2,80,418 మంది రైతులున్నారు. ఇందులో 2,74,214 మందికి సంబంధించి ఇకేవైసిలు పూర్తయ్యాయి. 530 మంది రైతులకు సంబంధించి ఇంకా ఈ కెవైసిలు పెండింగ్‌లో ఉన్నాయి. 5674 మంది రైతులకు సంబంధించి ఈ-కెవైసి తిరస్కరణకు గురయ్యాయి. కంబదూరు మండలంలో అత్యధికంగా 369 మంది రైతులకు అత్యధికంగా తిరస్కరణకుగురైన వాటిల్లోనున్నాయి. ఆ తరువాత ఉరవకొండ 308 మంది రైతులు తిరస్కరణకు గురయ్యారు. అత్యధికంగా లబ్ధిపొందుతున్న రైతుల సంఖ్య మండలాల వారీగా చూస్తే 11,493 మంది రైతులు అర్హులుగానున్నారు. గుంతకల్లు 10,582 మంది, వజ్రకరూరు 10845 మంది రైతులకు లబ్ధిచేకూరనుంది. కనిష్ఠంగా చూసినప్పుడు అనంతపురం అర్బన్‌లో 384 మంది రైతులు అన్నదాత సుఖీభవకు అర్హులుగానున్నారు.



రూ.191.9 కోట్లు

ఈ-కేవైసి పూర్తయినంత వరకు చూసినప్పుడు 2.74 మంది రైతులకు ఒక్కొక్కరికి ఏడు వేల రూపాయల చొప్పున డబ్బులు రైతుల ఖాతాల్లో జమకానున్నాయి. దీని ప్రకారం జిల్లాలో రూ.191.9 కోట్లు రైతుల ఖాతాల్లోకి రేపటి నుంచి డబ్బులు జమ చేయనున్నారు. ఏప్రిల్ నుంచి జులై మధ్య మొదటి విడత ఆగస్టు నుంచి సెప్టంబర్ మధ్య రెండవ విడత, డిసెంబరు నుంచి మార్చి మధ్య మూడో విడత అన్నదాత సుఖీభవ అందించే విధంగా ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు రేపు మొదటి విడత కింద ఏడు వేల రూపాయలను విడుదల చేయనున్నారు.

రేపు అన్నదాత సుఖీభవ మంజూరు
జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ.

అన్నదాత సుఖీభవ మొదటి ఇడత కింద ఆగస్టు రెండవ తేదీన రైతుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేయనుంది. పెండింగ్‌లోనున్న వాటికి కూడా ఎన్‌పిసిఐ, ఈకేవైసి పూర్తవగానే వారి ఖాతాల్లోకి జమవుతాయి. ఈ-కేవైసి ఇప్పటికే పూర్తయిన వాటికి నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోకి రేపటి నుంచి డబ్బులు జమవుతాయి.



విజేతగా నిలిచిన బాలికల ఫుట్‌బాల్ జట్టు

రాష్ట్ర స్థాయిలో బాలికల ఫుట్‌బాల్ జట్టు విజయం

ప్రజాశక్తి-కళ్యాణదుర్గంటౌన్

ఇటీవల అనంతపురం ఫుట్‌బాల్ అసోషియేషన్ ఆధ్వర్యంలో తిరుపతి జిల్లా నాయుడుపేటలో జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్ బాలికల ఫుట్‌బాల్ జట్టు పోటీల్లో జిల్లా జట్టు విజయం సాధించడంపై కళ్యాణదుర్గంకు చెందిన కోచ్‌లు శివ, మహేష్, రిటైర్డ్ అధ్యాపకులు మల్లికార్జున హర్షం వ్యక్తం చేశారు. పట్టణంలో గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఆ పోటీల్లో రాష్ట్రంలోని 24 జిల్లాల జట్లు 8 జోన్లుగా తలపడ్డాయన్నారు. అనంతపురం జట్టు తొలి మ్యాచ్‌లో పల్నాడుతో 6-0తో, రెండో మ్యాచ్‌లో తూర్పుగోదావరితో 9-0తో విజయం సాధించి ఫైనల్‌లో కడప జట్టుతో తలపడింది. గంట వ్యవధిలో జరిగిన మ్యాచ్‌లో అనంతపురం జట్టు 2-1 గోల్స్ తేడాతో విజయం సాధించింది. ఫైనల్‌లో కళ్యాణదుర్గంకు చెందిన క్రీడాకారిణి తను, అనంతపురానికి చెందిన నమ్రత చెరొక గోల్ సాధించి విజయంలో కీలక పాత్ర పోషించారన్నారు. కళ్యాణదుర్గంకు చెందిన వివిధ పాఠశాలల్లో చదువుతున్న ఫుట్‌బాల్ జట్టు క్రీడాకారిణులు తను, ఉషారాణి, జ్యోష్న టోర్నమెంట్‌లో ప్రతిభకనబరచడంతో కోచ్‌లు అభినందించారు.

కంబదూరు మండలం ఎంఈఓగా ఉమాపతి

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

కంబదూరు మండల నూతన విద్యాశాఖాధికారిగా ఉమాపతి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన్ను పలువురు ఉపాధ్యాయులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మండలంలో విద్యాభివృద్ధికి అందరం సమిష్టిగా పని చేద్దామని ఎంఇఒ తెలియజేశారు.

అహుడా పరిధిలో ల్యాండ్ బ్యాంకును గుర్తించాలి

ఇన్‌ఛార్జి కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అహుడా పరిధిలో ల్యాండ్ బ్యాంక్‌ను గుర్తించాలని ఇన్‌ఛార్జి కలెక్టర్ శివ్ నారాయన్ శర్మ సంబంధిత శాధికారులను ఆదేశించారు. గురువారం ఉదయం తన క్యాంపు కార్యాలయంలో అహుడా విభాగం ప్రణాళిక, ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని వివిధ మున్సిపాలిటీలను మరింతగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉన్న నేపథ్యంలో అహుడా పరిధిలో అవసరమైన ల్యాండ్ బ్యాంక్‌ను ఎక్కువగా గుర్తించాలని ఆదేశించారు. ఎంఐజి లేఅవుట్‌లలో జరిగిన అభివృద్ధి పనుల గురించి ఆరా తీశారు. అనంతపురం, మడకశిర, కళ్యాణదుర్గం, గుత్తి, పుట్టపర్తి హిందూపురం, పెనుగొండ తదితర ప్రాంతాల్లో అహుడా కు సంబంధించి చేపట్టిన చర్యలు ప్రస్తుత స్థితిగతులను సంబంధిత అధికారుల ద్వారా అడిగితెలుసుకున్నారు. అనుమతులు లేని, క్రమబద్ధీకరణ కానీ ప్లాట్ల రిజిస్ట్రేషన్‌లకు కచ్చితంగా అనుమతి పొందాల్సి ఉంటుంద న్నారు. అనుమతులు లేని క్రమబద్ధీకరణ చేసుకోని వారిపై జిల్లా పంచాయతీ అధికారి సమన్వయం చేసుకుని నోటీసులను జారీ చేయాలన్నారు. ఈ సమావేశంలో అహుడా కార్యదర్శి రామకృష్ణారెడ్డి, ప్లానింగ్ అధికారి ఇషాక్, ఈఈ దుష్యంత్, జెపిఒ హరీష్, సర్వేయర్ శరత్ బాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ

లేఅవుట్ల క్రమబద్ధీకరణపై సమీక్ష

అహుడా పరిధిలోని లేఅవుట్ల సవరణలకు సంబంధించి అహుడా చైర్మన్ టిసి.వరుణ్ గురువారం స్థానిక అహుడా కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనధికార లేఅవుట్లలో ఎటువంటి భవన అనుమతులు పొందే వీలుండదన్నారు. నూతన ఎల్ఆర్ఎస్ నిబంధనలు, 2020 సవరణల ప్రకారం, ఎల్ఆర్ఎస్ అర్హత పొందాలంటే అనధికార లేఅవుట్లో 30.06.2025కు ముందు ప్లాట్ల రిజిస్ట్రేషన్ (సేల్ డీడ్ లేదా టైటిల్ డీడ్ రూపంలో) అయి ఉండాలన్నారు. కనీసం ఒక ప్లాట్ అయినా 30.06.2025కి ముందే అమ్మకం జరిగి ఉండాలని తెలియజేశారు. ఈ సవరణ నిబంధనలు అమలులోకి వచ్చిన తేదీ నుంచి 90 రోజుల్లోపుగా, అనుమతిలేని లేఅవుట్లో ప్లాట్ కలిగిన ప్రతి యజమాని తప్పనిసరిగా ప్లాట్/లేఅవుట్ నియమితీకరణ కోసం దరఖాస్తు చేయాలి అని తెలియజేశారు. ఇకపై అనధికార లేఔట్‌లలో ఎటువంటి భవన అనుమతులూ జారీ చేయమని తెలియజేశారు. ఈ సమావేశంలోఆహుడా ప్లానింగ్ ఆఫీసర్ ఇషాక్, ఈఈ దుష్యంత్, జెపిఒ హరీష్ చౌదరి, డిఈఈలు రేవంత్, సరస్వతి పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన

బొమ్మనహాల్ :మండలంలోని శ్రీధరఘట్ట గ్రామ ఆర్‌డిటి పాఠశాలలో గురువారం ప్రజలకు చట్టాలపై అవగా హన కల్పించారు. తహశీల్దార్ మునివేలు, ఎస్ఐ నబిరసూల్ ప్రజలకు హక్కులు, బాధ్యతలు, చట్టాల పై అవగాహన కల్పించారు. తహశీల్దార్ మాట్లాడుతూ ఇరుగు పొరుగు వారితో సత్సంబంధాలు కలిగి ఉండాలన్నారు. పొలాల వద్ద హద్దులు, నీటి వినియోగం విషయంలో సహనం పాటించి సమస్యలు లేకుండా జీవించాలని సూచించారు. ఎస్ఐ మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహనానికి ఇన్సూరెన్స్ చేయించుకోవాలన్నారు. సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. టిడిపి మండల కన్వీనర్ బలరామిరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీల అమలులో ప్రభుత్వం విఫలం

ప్రజాశక్తి-రాయదుర్గం



సమావేశంలో మాట్లాడుతున్న గౌని ప్రతాప్‌రెడ్డి

సూపర్ సిక్స్ పథకాలతో పాటు ఎన్నికల హామీలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి గౌని ప్రతాపరెడ్డి విమర్శించారు. రాబోయే స్థానిక సంస్థలు, మున్సిపల్, సర్పంచి ఎన్నికల్లో పోటీకి పార్టీ సిద్ధం అన్నారు. పార్టీ ఇన్‌ఛార్జిగా బాధ్యతలు స్వీకరించాక తొలిసారి ఆయన పట్టణంలోని తన నివాసంలో గురువారం పార్టీ విస్తృతస్థాయి సమా వేశం నిర్వహించారు. ముందుగా నియోజకవర్గంలోని ఐదు మండలాల కన్వీనర్లు, ముఖ్య నాయకులు ఆయనను ఘనంగా సత్కరించారు. ప్రతాపరెడ్డి మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలు కేవలం టిడిపి శ్రేణులకేనా అని ప్రశ్నించారు. అర్హత ఉండి ప్రభుత్వ పథకాలు అందని వారి కోసం జిపిఆర్ హెల్ప్ లైన్-73865 66233 ఏర్పాటు చేశామన్నారు. ఈ నెంబర్‌కు ఫిర్యాదు చేస్తే వారి సమస్య పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. రాయదుర్గం రైతు రక్షణ వేదిక స్థాపించి రైతుల కోసం పోరాడుతున్న తనను కాంగ్రెస్‌పార్టీ అధిష్టానం గుర్తించి పార్టీలో అవకాశం కల్పించిందన్నారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలను కలుపుకొని పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. కూటమి నాయకులు అనేక హామీలు ఇచ్చి వాటిని నెరవేర్చకుండా మోసం చేస్తున్న విషయాలను ప్రజలకు వివరిద్దామన్నారు. సమావేశంలో నాయకులు లోకనాథ్‌రెడ్డి, చిదానందరెడ్డి, జయన్న, రామంజి, బాషా, అశోక్, మహబూబ్, అనిల్‌కుమార్ యాదవ్, ఎన్ఎస్‌యుఐ నాయకులు అనిల్, జోసెఫ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

చంద్రబాబుపై జగన్ వ్యాఖ్యలు హాస్యాస్పదం

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

సిఎం చంద్రబాబు బావిలో దూకాలని వైసిపి అధినేత జగన్ చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని రాష్ట్ర కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ నీలాస్వామి పేర్కొన్నారు. మండలంలోని గుండిగానిపల్లి గ్రామంలోని తన నివాసంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సిఎం చంద్రబాబుపై జగన్ చేసిన వ్యాఖ్యలపై స్పందించారు. సిఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఈ ఏడాది కాలంలోనే రాష్ట్రంలో ఎన్నో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందన్నారు. ప్రధానంగా డీఎస్సీ ద్వారా 16 వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయనుందన్నారు. టిసిఎస్, గూగుల్, తదితర పెద్ద పెద్ద కంపెనీలను ఎపికి తీసుకొచ్చిందన్నారు. వైసిపి ప్రభుత్వం దురుద్దేశంతో తీసుకొచ్చిన ల్యాండ్ టైటిల్ యాక్ట్‌ను రద్దు చేసిందన్నారు. వృద్ధాప్య వితంతు, వికలాంగుల పింఛన్ల మొత్తం పెంచారన్నారు. ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుకుంటే అందరికీ తల్లికి వందనం అమలు చేశారన్నారు. రైతులకు అన్నదాత సుఖీభవ,మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, తదితర సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ముఖ్యంగా పోలవరం, రాజధాని అమరావతి పనులను వేగవంతం చేశారన్నారు. అలాంటి గొప్ప వ్యక్తి గురించి చౌకబారు వ్యాఖ్యలు చేయడం సిగ్గు చేటన్నారు.

పాలిటెక్నిక్‌లో స్పాట్ అడ్మిషన్లు

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయనున్నట్లు ప్రిన్సిపల్ వి.నరసింహారెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. తుది విడత కౌన్సిలింగ్ ముగిసిన నేపథ్యంలో సివిల్, మెకానికల్ ఇంజినీరింగ్ డిప్లొమో కోర్సుల్లో మిగిలిన సీట్లను స్పాట్ అడ్మిషన్స్ విధానం ద్వారా భర్తీ చేస్తున్నట్లు తెలిపారు. పదో తరగతి పాసైన విద్యార్థులు ఆగష్టు 5వ తేదీ లోపు పాలిటెక్నిక్ కళాశాలకు వెళ్లి అప్లికేషన్ భర్తీ చేసి ప్రవేశం పొందవచ్చని తెలిపారు. వివరాలకు 9010222165 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

ఆత్మకూరులో అధికారుల తీరు ఆక్షేపణీయం



మాట్లాడుతున్న ఎంపిపిల సంఘం రాష్ట్ర కార్యదర్శి నారాయణరెడ్డి

ప్రజాశక్తి-ఆత్మకూరు

ప్రజాప్రతినిధులపై మండల ఎంపిడిఒ విజయలక్ష్మి వ్యవహార శైలి ఆక్షేపణీయమని ఎంపిపిల సంఘం రాష్ట్ర కార్యదర్శి నారాయణరెడ్డి, జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. గురువారం మండల కేంద్రంలో ఆత్మకూరు ఎంపిపి సుబ్బర హేమలతను మర్యాద పూర్వకంగా కలిశారు. ఇందులో భాగంగా ఇటీవల జరిగిన ఆత్మకూరు మండల మీట్‌లో ఎంపీపీ హక్కులను కాలరాసేలా అధికారులు వ్యవహరించిన తీరుపై చర్చించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ సర్వసభ్య సమావేశం జరుగుతుండగా టీడీపీ నేతలు వచ్చి పదే పదే సభకు అంతరాయం కలిగించడంతో పాటు ఎంపీపీ హేమలత పట్ల వ్యవహరించిన తీరు బాధాకరమన్నారు. మహిళ అని కూడా లేకుండా సభ మధ్యలోకి ప్రవేశించడమే కాకుండా దుర్భాషలాడడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారికి ఎంపిడిఒ విజయలక్ష్మి ప్రోత్సాహం అందించడంపై వారు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇలాంటి మరలా జరగకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పౌర హక్కులపై అవగాహన

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

చట్టం కల్పించిన అన్ని హక్కులు అందరికీ సమానంగా అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అని తహశీల్దార్ సుమతి పేర్కొన్నారు. మండలంలోని బుడిమేపల్లి గ్రామ అంబేద్కర్ కాలనీలో గురువారం పౌరహక్కులపై గ్రామసభను నిర్వహించారు. తహశీల్దార్ మాట్లాడుతూ హక్కులు అందరికీ సమానంగా అందినప్పుడే దేశం సమగ్రంగా అభివృద్ధి చెందుతుందన్నారు. చట్టం ముందు అందరూ సమానమే అన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రంగనాయకులు, ఆర్ఐ నాగిరెడ్డి, సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ శ్రీనివాసులు, వీఆర్వో హనుమేష్, పంచాయతీ కార్యదర్శి యోగేష్, అంగన్వాడీ కార్యకర్తలు గంగమ్మ, సబియా, నాయకులు నాగరాజుయాదవ్, తిప్పేస్వామి, సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం సూర్యవంశీ సైనిక్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఇందులో 30 మంది రక్తదానం చేసినట్లు డాక్టర్ జయలక్ష్మి తెలిపారు. రక్తదాతలకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. శిబిరంలో సూర్యవంశీ సైనిక్ సంస్థ అధ్యక్షుడు ప్రవీణ్, ఉపాధ్యక్షులు సంజయ్, యశ్వంత్, శివ, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ హెచ్ఎంకు సన్మానం

ప్రజాశక్తి-బొమ్మనహాల్

ఉద్యోగ విరమణ పొందిన హెచ్ఎం లతను గురువారం మండలంలోని లింగదహాల్ జడ్పీ హై స్కూల్‌లో ఇన్‌ఛార్జి హెచ్ఎం శ్రీనివాసులు అధ్యక్షతన సన్మానించారు. ముఖ్యఅతిథిగా ఎంఇఒలు ఈరన్న, మల్లికార్జునగౌడ్, ఎస్ఎంసి ఛైర్మన్ ఈరన్న హాజరై ఆమెను పూలమాలలు, శాలువాలతో సత్క రించి సన్మానించారు. హెచ్ఎం లత సేవలను కొనియాడారు. తన ఉపాధ్యాయ వృత్తి కడప జిల్లాలో ప్రారంభమై 28 ఏళ్లుగా సేవలందించి ఇక్కడ ఉద్యోగ విరమణ పొందడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో లత భర్త, కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు, పాల్గొన్నారు.



హెచ్ఎం లత ఉద్యోగ విరమణ సభలో పాల్గొన్న ఎంఇఒలు, ఉపాధ్యాయులు

అధిక వడ్డీ వ్యాపారులు అరెస్టు

◆ వివరాలు వెల్లడించిన ఎస్పీ ◆ అధిక వడ్డీ వసూలు చేస్తే చర్యలు తప్పవు :ఎస్పీ



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ వి.రత్న

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణంలో సంచలనం రేపిన అధిక వడ్డీ వ్యాపారులపై పోలీసులు చర్యలు చేపట్టారు. వడ్డీ వ్యాపారులు ఓ కుటుంబంపై దాడి చేసి భయభ్రాంతులకు గురి చేసిన ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించి గురువారం నాడు జిల్లా పోలీసు కార్యాలయంలో ధర్మవరం ఇన్‌ఛార్జి డీఎస్పీ వి.నర్సింగప్పతో కలిసి ఎస్పీ వి.రత్న వివరాలను విలేకరులకు వెల్లడించారు. ధర్మవరం పట్టణానికి చెందిన చేనేత కార్మికుడు రమణ అనే వ్యక్తి అదే పట్టణానికి చెందిన ఎరికల రాజాతో రూ.6 లక్షలు వడ్డీకి అప్పు తీసుకున్నాడు. వారానికి రూ.10ప్రకారం వడ్డీ రూపంలో రూ.15 లక్షల వరకు చెల్లించినట్లు బాధితుడు చెబుతున్నాడు. తన ఆర్థిక పరిస్థితి బాగా లేని కారణంగా అంత వడ్డీ ఇవ్వలేనని రమణ ఇటీవల డబ్బులిచ్చిన వ్యక్తికి చెప్పాడు. ఈ క్రమంలో గత నెల 23వ తేదీ సాయంత్రం 7 గంటల సమయంలో ధర్మవరం పట్టణం, శాంతి నగర్‌లోని దేవరశెట్టి భారతి ఇంట్లోకి ఎరికిల రాజా అనుచరులు మండల మహేష్, ముద్దనగుల వినోద్ కుమార్, గుజ్జల హేమంత్ కుమార్, గుంజర గోవర్ధన్, జెర్రిపోతుల మనోహర్‌లు వెళ్లారు. డబ్బులు ఇవ్వాలని రమణను అడిగారు. ఇప్పటికే చాలా వడ్డీ కట్టానని తన పరిస్థితి సరిగా లేని కారణంగా ఇక అంత వడ్డీ కట్టలేనని అతను వారికి తెలిపాడు. డబ్బులు ఇవ్వాలిందే అంటూ అక్కడికి వెళ్లిన ఐదుగురూ రమణ, అతని భార్య, పిల్లలపై దాడి చేసి రూ.7వేలను బలవంతంగా వసూలు చేశారు. అనంతరం నిందితులు అక్కడి నుంచి పారిపోయారు. ఈ ఘటనపై బాధితులు ధర్మవరం పోలీసు స్టేషన్‌లో మరుసటి రోజు ఫిర్యాదు చేశారు. అప్పటికే దాడి ఘటన సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుల కోసం గాలించారు. ఎస్పీ ఆదేశాల మేరకు ధర్మవరం ఇన్‌ఛార్జి డీఎస్పీ నర్సింగప్ప పర్యవేక్షణలో ప్రత్యేక పోలీస్ బందాలు నిందితుల కోసం గాలించారు. సాంకేతిక పరిజ్ఞానం సాయంతో నిందితుల మొబైల్ ఫోన్ల ద్వారా వారున్న ప్రాంతాన్ని గుర్తించారు. అందులో భాగంగా గత నెల 30వ తేదీ నిందితులు మండల మహేష్, ముద్దనగుల వినోద్ కుమార్, గుజ్జల హేమంత్ కుమార్, గుంజర గోవర్ధన్, జెర్రిపోతుల మనోహర్‌లను అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో మొదటి నిందితుడు యర్రగుంట్ల రాజా అలియాస్ ఎరుకుల రాజా, ఎ7 గుజ్జల విజయ్‌లు పరారీలో ఉన్నారని వారి కోసం ప్రత్యేక బందాలు ఏర్పాటు చేసి గాలిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. ఎరుకుల రాజాపై ధర్మవరం పోలీసు స్టేషన్‌లో పలు కేసులు నమోదు కాగా అతనిపై రౌడీషీట్ కొనసాగుతోందన్నారు. దాడికి పాల్పడిన నిందితులపై పీడీ యాక్ట్ అమలు చేసే ప్రతిపాదనలు ఉన్నాయన్నారు. జిల్లాలో అధిక వడ్డీల పేరుతో ఎవరైనా బెదిరింపులకు దిగితే బాధితులు పోలీసులకు సమాచారం ఇస్తే నిందితులను కఠినంగా శిక్షిస్తామని ఎస్పీ తెలిపారు. అధిక వడ్డీదారుల సమాచారం ఇచ్చే పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. విలేకరుల సమావేశంలో ఎఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, ధర్మవరం టూ టౌన్ సిఐ రెడ్డప్ప, ఆర్ఐలు వలి, మహేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

రైతుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని చాగల్లు రిజర్వాయర్ నుంచి పుట్లూరు మండలం కొండాపురం వరకూ ఉన్న ఫీడర్ కాలువను ఎమ్మెల్యే పరిశీలించారు. ఇందులో భాగంగా చేయాల్సిన కాలువ పనులపై అధికారులతో చర్చించారు. రైతు సుభిక్షంగా ఉంటేనే దేశం బాగుంటుందని నమ్మేదే తమ ప్రభుత్వం అన్నారు. వారి కళ్లలో ఆనందం చూడటమే తమ లక్ష్యమన్నారు. చాగల్లు రిజర్వాయర్ నుంచి పుట్లూరు మండలంలోని కొండాపురం వరకు వెళ్లే ఫీడర్ కాలువ పనులను త్వరితగతిన పూర్తి చేసి దాదాపు పదివేలపైగా గ్రామాలకు సాగునీరు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు రామకృష్ణారెడ్డి, భాస్కర్‌రెడ్డి, యువ నాయకులు లోకనాథ్‌రెడ్డి, అమర్నాథరెడ్డి పాల్గొన్నారు.



సాగునీటి కాలువలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి

సిఎం రిలీఫ్ ఫండ్‌తో పేదలకు ఆర్థిక భరోసా

ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్

ప్రజాశక్తి-గుంతకల్లు

పేదల సంక్షేమమే లక్ష్యంగా సిఎం చంద్రబాబు ఏడాది పాలన సాగిందని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ అన్నారు. గురువారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో 18వ విడతలో 24 మంది లబ్ధిదారులకు సిఎం సహాయ నిధి కింద మంజూరైన రూ.9.78 లక్షల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సిఎం చంద్రబాబు నాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం సుపరిపాలనలో తొలిఅడుగు వేస్తూ అన్ని వర్గాల ప్రజలు ఆకాంక్షలకు అనుగుణంగా పరిపాలన సాగిస్తోందన్నారు. అయితే వైసిపి అధినేత జగన్ విధ్వంసకర నియంతృత్వ పోకడలతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా ఉన్నా కూటమి ప్రభుత్వం వెనకడుగు వేయడం లేదన్నారు. కేవలం పింఛన్ల రూపంలో ఏడాదికి రూ.34వేల కోట్ల వ్యయం చేస్తోందన్నారు. మహిళలకు ఉచితంగా మూడు వంట గ్యాస్ సిలిండర్లు అమలు చేస్తోందన్నారు. అనారోగ్యాల బారిన పడి ఎన్టీఆర్ వైద్య సేవలు వర్తించని పేదలకు సిఎం రిలీఫ్ ఫండ్ విడుదల చేసి ఆర్థిక భరోసా ఇస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఇన్‌ఛార్జి గుమ్మనూరు నారాయణస్వామి, టిడిపి డాక్టర్స్ సెల్ జిల్లా అధ్యక్షురాలు పత్తి హిమబిందు, పట్టణ అధ్యక్షులు ముక్కన్నగారి గుణశేఖర్, సర్పంచు శ్రీరాములు, నాయకులు యుగంధర్, ఫజులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పట్టించుకోని పాలకులు

వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి



ప్రజాశక్తి-అనంతపురం

కరువు కోరల్లో చిక్కుకున్న ఉమ్మడి అనంతపురం జిల్లా రైతాంగాన్ని పట్టించుకునే పాలకులే కరువయ్యారని వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి విమర్శించారు. గురువారం నగరంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో జిల్లా రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందన్నారు. ఖరీఫ్ ప్రారంభంలో అరకొరగా వర్షాలు కురిస్తే వేరుశనగ, పత్తి, ఆముదం, కంది సాగు చేశారు. ఇప్పుడు ఆ పంటలు ఎండిపోయే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో సాధారణ సాగు విస్తీర్ణం 15 లక్షల ఎకరాలు ఉండగా, ఈ ఏడాది కార్తెలు అయిపోయినా ఇప్పటి వరకు కేవలం 3.94 లక్షల ఎకరాల్లోనే సాగు చేశారన్నారు. మరోవైపు జిల్లాలోని మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు కనీసం రైతుల గురించి పట్టించుకుంటున్న పాపానపోలేదన్నారు. ఇలాంటి పరిస్థితి గతంలో ఎన్నడూ లేదని విచారం వ్యక్తం చేశారు. తుంగభద్ర డ్యాంలో నీరు పుష్కలంగా ఉన్నా వినియోగించుకోలేని పరిస్థితి ఉన్నారు. వైఎస్ జగన్ హయాంలో ప్రభుత్వమే పంటల బీమా చెల్లించిందన్నారు. అయితే చంద్రబాబు వచ్చాక రైతులే ప్రీమియం చెల్లించాలని నిబంధన పెట్టడం బాధాకరమన్నారు. వైఎస్ జగన్ హయాంలో పీఎం కిసాన్‌తో కలిపి రైతు భరోసా కింద ఏటా రూ.13500 పెట్టుబడి సాయం అందజేశామన్నారు. గత ఎన్నికల సమయంలో కేంద్రంతో సంబంధం లేకుండా అన్నదాత సుఖీభవ కింద ఏటా రూ.20వేలు ఇస్తామని చంద్రబాబు హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక కేంద్రంతో కలిపి ఇస్తామన్నారు. అధికారంలోకి వచ్చాక తొలి ఏడాది రైతుకు ఎగనామం పెట్టారని ఆరోపించారు. ఇప్పటికైనా మంత్రులు, ప్రజాప్రతినిధులు వ్యవసాయంపై సమీక్ష చేయాలని హితవు పలికారు. ప్రభుత్వం స్పందించకపోతే కలిసొచ్చే పార్టీలు, రైతులతో కలిసి పోరాటానికి సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు.

వేగవంతంగా రీసర్వే:తహశీల్దార్



ప్రజాశక్తి-రాప్తాడు

ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల పరిధిలోని రెవెన్యూ పరిధిలో వేగవంతంగా రీసర్వే చేస్తున్నామని తహశీల్దార్ విజయకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని హంపాపురం, బండమీదపల్లి, గొందిరెడ్డిపల్లి గ్రామాల్లో రీసర్వే చేస్తున్నట్లు వివరించారు. బండమీదపల్లిలో పూర్తిస్థాయిలో భూముల రీసర్వే కార్యక్రమం పూర్తయిందన్నారు. ప్రస్తుతం గొందిరెడ్డిపల్లి జరుగుతుందన్నారు. రీసర్వేలో ఏమైనా సమస్యలు వస్తుంటే పరిష్కరిస్తూ ముందుకెళ్తున్నామన్నారు. ఇప్పటివరకు చేపట్టిన రీసర్వేలో కొంతశాతం మాత్రమే సమస్యాత్మకంగా భూములు ఉన్నట్లు గుర్తించామన్నారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పి.4 సర్వే కూడా చేస్తున్నట్లు వివరించారు.

యాప్‌లపై శిక్షణ

అనంతపురం : స్థానిక డ్వామా కార్యాలయంలోని సమావేశ మందిరంలో గురువారం ఒకరోజు టిఓటి శిక్షణ ఇచ్చారు. ఇందులో భాగంగా డ్వామా పీడీ సలీంబాషా జియో-ట్యాగింగ్, జియో-ఫెన్సింగ్, మొబైల్ యాప్ ప్రత్యక్ష అప్లికేషన్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి శ్రీనివాసులు, ఎపిడి విజయకుమార్, జిఐఎస్ రీజినల్ మేనేజర్ కుసుమకుమారి, రీజినల్ మేనేజర్ రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

పామిడి : మండల కేంద్రంలోని 11వ వార్డులో గురువారం నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. లోవోల్టేజ్ కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు గతంలో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ తనయుడు ఈశ్వర్‌కు విన్నవించారు. ఇందుకు స్పందించి ఆయన అధికారులతో మాట్లాడి ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయించారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి ప్రభాకర్‌చౌదరి, బొల్లు శ్రీనివాస్‌రెడ్డి, జింకల సంజీవకుమార్, గౌస్‌పీరా, పట్టణ కన్వీనర్ బొమ్మ మోహన్, మండల కన్వీనర్ సురేష్‌రెడ్డి, కరూరు శివశంకర్, అప్పన్నగారి కుమార్, తిమ్మప్ప, బాబావలి, రఫీ, రాజు, ఖలందర్ పాల్గొన్నారు.

భూసార పరీక్షలపై శిక్షణ

అనంతపురం : ఏరిస్ అగ్రో లిమిటెడ్ కంపెనీ, రసాయన శాస్త్ర విభాగం, ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల మధ్య కుదిరిన అవగాహన ఒప్పందం మేరకు రసాయన శాస్త్ర విభాగంలో విద్యార్థులకు భూసార పరీక్షలపై గురువారం ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఇందులో భాగంగా 11 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లను, స్టైఫండ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎరిస్ ఆగ్రో లిమిటెడ్ కంపెనీ రీసెర్చ్ విభాగం రాధిక, కంపెనీ ఫైనాన్షియల్ మేనేజర్ అబ్దుల్‌రెహ్మాన్, ఏరిస్ ఆగ్రో లిమిటెడ్ డిస్ట్రిబ్యూటర్ మేనేజర్ పద్మ, రసాయన శాస్త్ర అధ్యాపకులు పాల్గొన్నారు.

'పల్లె నిద్ర'తో చైతన్యం తేవాలి : ఎస్పీ

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

సమస్యాత్మక గ్రామాల్లో పోలీసులు పల్లె నిద్ర కార్యక్రమాలు నిర్వహించి శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా ప్రజలను చైతన్యం చేయాలని ఎస్పీ పి.జగదీష్ ఆదేశించారు. ఎస్పీ ఆదేశాలతో బుధవారం రాత్రి జిల్లావ్యాప్తంగా పలుగ్రామాల్లో పోలీసులు పల్లెనిద్ర చేపట్టారు. ఇందులో భాగంగా ఆయా గ్రామాల్లో మట్కా, పేకాట, క్రికెట్ బెట్టింగ్, ఇసుక అక్రమ రవాణా, గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగం, అక్రమ మద్యం, నాటుసారా వంటి వాటిపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గ్రామాల ప్రజలతో ప్రత్యేకంగా సమావేశమై సమస్యలను అడిగి తెలుసుకుంటూనే.. ప్రస్తుత సమాజంలో జరుగుతున్న నేరాల గురించి వాటి బారిన పడకుండా ఏ విధంగా అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ముఖ్యంగా సైబర్ నేరాలు ఏవిధంగా జరుగుతున్నాయి.. వాటి బారిన పడకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకుని అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. అలాగే రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తపై అవగాహన కల్పించాలన్నారు. మహిళలు, చిన్నారులకు అండగా పోలీసు శాఖ ఉంటుందన్నారు. ఎవరైనా అసభ్యకరంగా వ్యవహరించినా, వెంటపడి వేధించినా, నేరాలకు పాల్పడినా చట్టపరంగా కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగడం చట్ట విరుద్ధమన్నారు. అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యకలాపాల గురించి సమాచారం తెలిస్తే స్థానిక పోలీస్ అధికారులకు (లేదా) డయల్ 100, 112 నంబర్లకు కాల్ చేసి అందించాలని విజ్ఞప్తి చేశారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న పోలీసులు

'సెంట్రల్ టీం వస్తోంది.. నివేదికలు తయారు చేయండి..'



మాట్లాడుతున్న పీడీ సలీంబాషా

పుట్లూరు : మండలంలో చేపట్టిన ఉపాధి హామీ పనులను పరిశీలించేందుకు కేంద్ర పరిశీలన బృందం వస్తోంది.. కావున ఇందుకు సంబంధించిన నివేదికలను తయారు చేసి ఉంచుకోవాలని నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ సలీంబాషా సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 4వతేదీన జిల్లాని పుట్లూరు, విడపనకల్లు, గుంతకల్లు మండలాల్లో సెంట్రల్ బృందం పర్యటిస్తుందన్నారు. ఈ బృందం ఉపాధి హామీ పనులతోపాటు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో చేపట్టిన పనులన్నింటినీ పరిశీలించనున్నట్లు తెలిపారు. కావున అన్ని రకాల నివేదికలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా విజిలెన్స్ అధికారి శ్రీనివాసులు, ఎఇఒ మల్లికార్జున డ్వామి నుంచి పర్వీష్, ఎపిఒ తులసీప్రసాద్, టిఎలు, ఎఫ్ఎలు, బిఎఫ్‌టిలు, సిఒలు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ ఎస్ఐకి సన్మానం

అనంతపురం క్రైం : నగరంలోని 4వ పట్టణ పోలీసుస్టేషన్‌లో పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన ఎస్ఐ అల్లాబకాష్‌ను ఎస్పీ పి.జగదీష్ గురువారం సన్మానం సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వరరెడ్డి, ఆర్ఐలు మధు, పవన్‌కుమార్, రాముడు, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు గాండ్ల హరినాథ్, ఎస్ఐ అల్లాబకాష్ కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెస్‌ఛార్జీలు పెంచాలి

పామిడి : హాస్టళ్లలోని విద్యార్థులకు మెస్‌తోపాటు కాస్మోటిక్ ఛార్జీలను పెంచాలని వైసిపి విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంశీయాదవ్ డిమాండ్ చేశారు. విద్యార్థి విభాగం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు చేపట్టిన హాస్టళ్ల బాటలో భాగంగా గురువారం పట్టణంలోని ఎస్సీ బాయ్స్ హాస్టల్‌ని విద్యార్థి విభాగం నాయకులు సందర్శించి విద్యార్థులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సమస్యలను నాయకుల దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యంగా దుప్పట్లు, దోమతెరలు, ట్రంకు పెట్టెలు, బ్యాగులు, యూనిఫామ్ ఇవ్వలేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. నాసిరకం ఉప్మా, నీళ్ల చెట్నీ పెడుతున్నారన్నారు. ఆయా సమస్యలపై వార్డెన్ ఎస్ఎం బాషాను ప్రశ్నించగా విద్యార్థులకు ఇస్తు మెస్‌ఛార్జీలు సరిపోవట్లేదని బదులివ్వడం బాధాకరమన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి విద్యార్థులకు మెస్, కాస్మోటిక్ ఛార్జీలను పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పామిడి పట్టణ విద్యార్థి విభాగం అధ్యక్షులు జిలాన్, ఉపాధ్యక్షులు రమేష్, యువజన విభాగం పట్టణ అధ్యక్షులు వినోద్, దినేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

భజన మందిరానికి భూమిపూజ

యాడికి : మండల కేంద్రంలోని లింకు రోడ్డు సమీపంలో ఉన్న గుడికల్లు అల్లిపీర భజన మందిర నిర్మాణానికి గురువారం భూమిపూజ చేశారు. మందిర నిర్మాణానికి మండల కేంద్రానికి చెందిన చారుగుండ్ల వెంకటరమణ, రాయలచెరువు గ్రామానికి చెందిన హాజీవలీ 25 సెంట్ల స్థలాన్ని దానంగా ఇచ్చి ధాతృత్వాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో మురళీమోహన్‌గౌడ్, కోదండరాముడు, ఆదినారాయణ, రామ్మూర్తి నాయుడు, నబిరసూల్, బండారు రాఘవ, మహేశ్వర్‌రెడ్డి, సిలార్‌సాబ్, దస్తగిరి, తదితరులు పాల్గొన్నారు.

పౌర హక్కుల దినోత్సవం

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా పోలీసులు గురువారం పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో సంబంధిత సిఐలు, ఎస్ఐల ఆధ్వర్యంలో పోలీసులతోపాటు రెవెన్యూ, సాంఘిక సంక్షేమ శాఖ, గ్రామ సచివాలయ కార్యదర్శులు సంయుక్తంగా రాజ్యాంగంలోని పౌరులకు కల్పించిన చట్టాలు, పౌర హక్కులపై అవగాహన కల్పించారు.

పుట్లూరు : మండల పరిధిలోని చింతకుంట ఎస్సీ కాలనీలో ఉన్న ఆర్‌డిటి కార్యాలయంలో తహశీల్దార్ శేషారెడ్డి ఆధ్వర్యంలో గురువారం పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐ సత్తిబాబు, ఆర్ఐ మధుసూదన్‌రెడ్డి, వీఆర్వో శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

బెలుగుప్ప : మండల పరిధిలోని అంకంపల్లి గ్రామంలో గురువారం పౌర హక్కులపై దినోత్సవాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా రాజ్యాంగం పౌరులకు కల్పించిన హక్కులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ అనిల్‌కుమార్, ఎంపిడిఒ లక్ష్మీనారాయణ, ఎస్ఐ శివ, ట్రైనీ మహేష్, ఇఒఆర్‌డి శివరంజని, హాస్టల్ వార్డెన్ అశ్వత, నాగరాజు, ఏఎన్ఎం రామ్మూర్తి, వీఆర్వో ఎర్రిస్వామి, టిడిపి నాయకులు నరేంద్రచౌదరి, తలారి ఈశ్వర్, శ్రీనివాసులు, కిష్ట, తదితరులు పాల్గొన్నారు.

మాట తప్పడం చంద్రబాబుకు అలవాటు

వైసిపి నియోజకర్గ సమన్వయర్త శైలజానాథ్

ప్రజాశక్తి-నార్పల

ఎన్నికల ముందు మాట ఇవ్వడం.. అధికారంలోకి వచ్చిన తర్వాత తప్పడం ముఖ్యమంత్రి చంద్రబాబుకు అలవాటు అని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త సాకే శైలజానాథ్ విమర్శించారు. వైసిపి మండల కన్వీనర్ ఖదర్ వలిఖాన్ ఆధ్వర్యంలో గురువారం మండల పరిధిలోని కేసేపల్లి, కురుగానిపల్లి గ్రామంల్లో 'బాబుషూరిటీ–మోసం గ్యారెంటీ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు మేనిఫెస్టోలో చేసిన మోసం చేసిన తీరును క్యూఆర్ కోడ్ ద్వారా ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ఎప్పుడు అధికారంలోకి వచ్చిన తప్పుడు హామీలు ఇచ్చి అధికారంలోకి వస్తారన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలను మోసం చేయడం ఆనవాయితీ అని విమర్శించారు. ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు నార్పల సత్యనారాయణరెడ్డి, వేదాంతం నాగరత్నమ్మ, ఎంపిపి నాగేశ్వరావు, శంకర్‌యాదవ్, రాజారెడ్డి, గోపాల్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, నాగలింగారెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, శ్రీరాములు, బయపురెడ్డి, నారాయణరెడ్డి, పక్కిరెడ్డి, శివారెడ్డి, పాపయ్య, యలపనాయుడు, పోలయ్య, లక్ష్మీరెడ్డి, లింగారెడ్డి, వెంకటేష్, సూర్యనారాయణ, మన్నీల శివయ్య, దాడితోట బాషా, బాలనాగి బయన్న, అమీర్‌బాషా, గుత్తి గోపాల్‌రెడ్డి, బాలనాగి రామాంజనేయులు, రాముడు, జిలాన్‌బాషా, భాస్కర్‌నాయుడు, రామాంజనేయులు, ముచ్చుకుంటపల్లి వెంకటనారాయణరెడ్డి, చిలముకూరి గోపాల్, ఈడిగ ఆదినారాయణ, రవికుమార్, వేదాంతం మోహన్, మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.



వైఎస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వైసిపి నేతలు

మున్సిపల్ కార్మికులకు వైద్యపరీక్షలు

గుత్తి : స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఛైర్‌పర్సన్ డి.వన్నూరుబి, కమిషనర్ బి.జబ్బార్‌మియా ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులకు గురువారం ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో భాగంగా కర్నూలు ఓమిని ఆసుపత్రి కార్డియాలజిస్ట్ డాక్టర్ ఇందు ప్రకాష్ రెడ్డి, డాక్టర్ సంతోష్ నాయక్ బిపి, షుగర్, ఈసీజీ, 2డి తదితర పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఓమిని ఆసుపత్రి సిబ్బంది సింధు, పృథ్వీ, మహేష్, మున్సిపల్ మేనేజర్ రాంబాబు,డిఇఇ హేమచంద్ర, ఆర్ఓ సతీష్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ మహబూబ్‌బాషా, టిపిఎస్ మారుతీప్రసాద్, సర్వేయర్ దినేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ప్లాస్టిక్‌ను నిషేధిద్దాం

గుత్తి : ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించి ఆరోగ్యాన్ని కాపాడుకుందామని మున్సిపల్ కమిషనర్ బి.జబ్బార్‌మియా పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని కార్యాలయంలో గురువారం టీస్టాల్ యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య దృష్ట్యా టీ స్టాల్ పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. టీ గ్లాసులు, గాజు గ్లాసులను మాత్రమే వినియోగించాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్స్‌పెక్టర్ మహబూబ్‌బాషా, హెల్త్ అసిస్టెంట్ నెట్టికల్లు, శానిటరీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సేవాఘడ్ విద్యార్థులకు వైద్యపరీక్షలు

గుత్తి : మండలంలోని చెర్లోపల్లి గ్రామ సమీపంలో ఉన్న సేవాఘడ్ గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో బేతాపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కె.ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, హెల్త్ సూపర్‌వైజర్ లాజరస్ సుధా, కమ్యూనిటీ హెల్త్ ఆర్గనైజర్లు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బీటెక్, ఎంబిఎ, ఎంసిఎ ఫలితాలు విడుదల

అనంతపురం : జెఎన్‌టియు విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహించిన బీటెక్ 4వ సంవత్సరం 2వ సెమిస్టర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ, ఎంబిఎ 2వ సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ, ఎంబిఎ 1వ సెమిస్టర్ సప్లిమెంటరీ, ఎంసిఎ 2వ సెమిస్టర్, రెగ్యులర్, సప్లిమెంటరీ, ఎంసిఎ 1వ సెమిస్టర్ సప్లిమెంటరీ, ఫార్మా–డి 4వ సంవత్సరం 2వ సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు డైరెక్టర్ అఫ్ ఎవాల్యుయేషన్ వి.నాగప్రసాద్‌నాయుడు, కంట్రోలర్ అఫ్ ఎగ్జామినేషన్ ఎపి శివ కుమార్, అడిషినల్ కంట్రోలర్లు జి.శంకర్‌శేఖర్‌రాజు, శ్రీధర్ ఎం.అంకారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షా ఫలితాల కోసం జెఎన్‌టియు వెబ్‌సైట్ www.jntuaresults.inను సంప్రదించాలని కోరారు.

బెలుగుప్ప ట్రైనీ ఎస్ఐగా జి.మహేష్



బెలుగుప్ప : ట్రైనీ ఎస్ఐగా జి.మహేష్ గురువారం మండలంలోని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బాధ్యతలు చేపట్టారు. 2024 –25 బ్యాచ్ కర్నూలు జిల్లాకు చెందిన ఈయన ఐదు నెలలపాటు ఇక్కడ శిక్షణ పొందనున్నారు.

ఆర్టీసీ ఆర్ఎం సేవలు మార్గదర్శకం

అనంతపురం : ఎపిఎస్ ఆర్‌టిసి రీజినల్ మేనేజర్ సుమంత్ ఆర్ ఆథోని సేవలు మార్గదర్శకమని పలువురు కొనియాడారు. ఆథోని ఉద్యోగ విరమణ సందర్భంగా గురువారం స్థానిక కార్యాలయంలో ఉమ్మడి అనంతపురం జిల్లా క్లాస్–11 సూపర్‌వైజర్ అసోసియేషన్ సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాల ట్రాఫిక్, మెకానికల్, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ల్యాబ్ తనిఖీ

యాడికి : మండల పరిధిలోని రాయలచెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు దేవరాజన్, అప్పయ్య, తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు, తదితరులు గురువారం ల్యాబ్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే జ్వర బాధితులందరికీ మలేరియా, డెంగీ, చికున్‌గున్యా, టైఫాయిడ్, తదితర రక్త పరీక్షలు చేయాలని టెక్నీషియన్ సాయిలతకు సూచించారు.

గవిమఠం ఆస్తులు కాపాడటమే లక్ష్యం

ఉరవకొండ : కర్ణాటక రాష్ట్రంలోనే కాకుండా ఇతర ప్రాంతాల్లో ఉన్న గవిమఠం ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా కాపాడటమే తన లక్ష్యమని గవిమఠం ఉత్తరాధికారి కరిబసవ రాజేంద్రస్వామి అన్నారు. ఈ సందర్భంగా గురువారం ఉరవకొండలో విలేకరులతో మాట్లాడుతూ 2018లో అప్పటి ఎపి ఎండోమెంట్ కమిషనర్ ఉత్తరాధికారి అయిన తనకు ఆస్తులను కాపాడటానికి రూ.12వేల గౌరవ వేతనం ఇవ్వాలని గవిమఠం మేనేజర్‌ను ఆదేశించారు. ఈ క్రమంలో తన దృష్టికి వచ్చిన కర్ణాటక రాష్ట్రంలోని చిత్రదుర్గ్ జిల్లా కృష్ణ రాజపురంలో ఉన్న (సర్వే నెంబర్ 39) 10 ఎకరాల వ్యవసాయ భూమిని గవిమఠం శాఖకు సంబంధించిన జాగిరు బుడ్డనహళ్లి అర్చకులకు ధూపదీప నైవేద్యానికి ఇచ్చిన భూమిని 2003లో అక్కడి రెవెన్యూ కార్యాలయంలో అక్రమంగా తమ పేరు మీదకు మార్చుకున్నట్లు తెలిసిందన్నారు. విషయాన్ని అక్కడి రెవెన్యూ, ఉన్నతాధికారుల దృష్టికి సాక్షాధారాలతో సహా తీసుకెళ్లి కాపాడానని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో వీరశైవ సంక్షేమ సమాజం అధ్యక్షులు పాటిల్ నాగన్నగౌడ్, కార్యదర్శి పాటిల్ నిరంజన్‌గౌడ్, రాకెట్ల మఠం వీరేశ్వామి తదితరులు పాల్గొన్నారు.

వైసిపి అధినేత జగన్ అరెస్టు ఖాయం

ఎపి పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పోతుల లక్ష్మీనరసింహులు

ప్రజాశక్తి-అనంతపురం

లిక్కర్ స్కాం కేసులో పులివెందుల ఎమ్మెల్యే, వైసిపి అధినేత వైఎస్ జగన్ అరెస్టు కావడం ఖామని రాష్ట్ర పద్మశాలి సంక్షేమం, అభివృద్ధి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పోతుల లక్ష్మీనరసింహులు జోస్యం చెప్పారు. గురువారం అనంతపురంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్‌రెడ్డి అధికారం కోల్పోయి అనవసరంగా ప్రజలకు సంబంధం లేకుండా పర్యటనలకు వెళ్తుంటే ప్రజలు ముఖం చాటేస్తున్నారన్నారు. ఇందులో భాగంఆనే నెల్లూరు పర్యటనకు వెళ్లిన జగన్‌కు ఇదే అనుభవం ఎదురైందన్నారు. అయితే వైసిపి నాయకులు మాత్రం రాష్ట్ర ప్రభుత్వం అడుగడుగునా అడ్డంకులు సృష్టించిందని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. నిబంధనల ప్రకారమే పోలీసులు వ్యవహరించారన్నారు. మహిళా ఎమ్మెల్యేను అసభ్యకరంగా, అగౌరవంగా మాట్లాడిన ప్రసన్నకుమార్‌రెడ్డిని పరామర్శించడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా రాష్ట్రంలో ప్రజల తీర్పుని శిరసావహించి మంచి పనులు చేయడానికి పూనుకోవాలని హితవు పలికారు.

ఎస్ఎఫ్ఐ నూతన కార్యవర్గం ఎన్నిక



ఎస్ఎఫ్ఐ నూతన కమిటీ సభ్యులు

ప్రజాశక్తి-గుత్తి

పట్టణంలోని జూనియర్ కళాశాలలో గురువారం ఎస్ఎఫ్ఐ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడిగా బాలాజీ, కార్యదర్శిగా నవీన్‌యాదవ్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ధను, సహాయ కార్యదర్శిగా హఫీజ్, అఖిల్, ఉపాధ్యక్షులుగా బాషా, శరత్‌కుమార్‌తోపాటు 21 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సి.రమేష్ మాట్లాడుతూ విద్యారంగ సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ విద్యను పరిరక్షించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పీడీ పోస్టులను కొనసాగించాలన్నారు. డిగ్రీ కళాశాలలో మేజర్ మైనర్ విధానాన్ని రద్దు చేయాలన్నారు .ఇంటెన్షిప్ విధానం రద్దు చేయాలన్నారు. ప్రస్తుతం పెరిగిన ధరలకు అనుకూలంగా సంక్షేమ హాస్టళ్లలో మెస్, కాస్మోటిక్ ఛార్జీలను రూ.3వేలకు పెంచాలన్నారు. శిథిలావస్థలో ఉన్న సంక్షేమ వసతి గృహాలకు నూతన భవనాలను నిర్మించాలన్నారు.

విధి నిర్వహణలో మీ సేవలు మరువలేనివి

ఉరవకొండ : ఆరోగ్య విస్తరణాధికారిగా విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ పొందుతున్న శ్రీరాములు సేవలు మరువలేనివని వైద్యాధికారులు తేజస్విని, సర్దార్ వలి కొనియాడారు. గురువారం వజ్రకరూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి ఎర్రిస్వామి, వైద్య సిబ్బంది గురుప్రసాద్, చాబాల సర్పంచ్ జగదీష్, సామాజిక వేత్త బెంజిమెన్, తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ విజేత శ్రీవాణి హైస్కూల్

ప్రజాశక్తి-తాడిపత్రి

తాడిపత్రి జూనియర్ కళాశాల మైదానంలో ఆర్డీటీ క్రికెట్ క్యాంపు ఆధ్వర్యంలో నిర్వహించిన తాడిపత్రి స్కూల్ క్రికెట్ టోర్నమెంట్‌లో శ్రీవాణి పాఠశాల జట్టు విజేతగా నిలిచింది. ఈ టోర్నమెంట్‌లో 70 పాఠశాలలు పాల్గొన్నాయి. బాలురు, బాలిక, బాల బాలికలు కలివిడిగా మూడు రకాలుగా కేటగిరీలు నిర్వహించి పోటీలు నిర్వహించారు. బాలుర విభాగంలో ఫైనల్లో శ్రీవాణి, గౌతమ్ మర్డర్ పాఠశాలల జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో శ్రీవాణి జట్టు 37 పరుగుల తేడాతో విజయం సాధించి విజేతగా నిలిచింది. బాలికల విభాగంలో ఫైనల్లో గౌతమ్ మోడరన్, శ్రీవాణి పాఠశాలల మధ్య జరిగిన మ్యాచ్‌లో గౌతమ్ స్కూల్ జట్టు 13 పరుగుల తేడాతో విజయం సాధించి విజేతగా నిలిచింది. మిక్స్ జెండర్ ఫైనల్లో ఆర్అండ్‌డి, ఎస్ఎస్‌విఎం హైస్కూల్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఎస్ఎస్వీఎం జట్టు 2 వికెట్ల తేడాతో విజయం సాధించి విజేతగా నిలిచింది. విజేతలకు తాడిపత్రి క్రికెటర్ అసోసియేషన్ సెక్రటరీ సాదిక్‌వలి, 30వ వార్డు కౌన్సిలర్ మల్లికార్జున, ప్రెస్ రిపోర్టర్ కన్నా బహుమతులు అందజేశారు.



విజేత ట్రోఫీ అందుకుంటున్న శ్రీవాణీ హైస్కూల్ జట్టు

'మీ సమస్య మా బాధ్యత'

రాప్తాడు : ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశాల మేరకు మండల పరిధిలోని బండమీదపల్లి గ్రామంలో టిడిపి నాయకులు 'మీ సమస్య మా బాధ్యత' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని అనుబంధ సంఘాల నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, యూనిట్ బూత్ కన్వీనర్లు, స్టోర్ డీలర్లు, గ్రామ కమిటీ సభ్యులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

చక్కెర వేలం వాయిదా

నార్పల : మండలం పరిధిలోని గూగూడు గ్రామంలో వెలసిన కుళ్లాయిస్వామి ఆలయ ఆవరణలో శుక్రవారం నిర్వహించాల్సిన చెక్కర బహిరంగ వేలం వాయిదా వేసినట్లు ఆలయ కార్య నిర్వహణాధికారి సాకేతపురం శోభ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఆయుష్ పీజీ ఎంట్రెన్స్‌లో మహమ్మద్‌షాకీర్ ప్రతిభ



గుత్తి : ఆయుష్ పోస్ట్ గ్రాడ్యుయేషన్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్‌లో గుత్తికి చెందిన టిడిపి నాయకుడు, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ దాండియా షఫీ కుమారుడు డాక్టర్ దాండియా మహమ్మద్ షాకీర్ అత్యంత ప్రతిభ కనపరిచాడు. జూలై 4న ఆయుష్ పోస్ట్ గ్రాడ్యుయేషన్ ఎంట్రెన్స్ పరీక్ష నిర్వహించారు. బుధవారం విడుదల చేసిన ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ ఫలితాల్లో దాండియా మహమ్మద్ షాకీర్ ఆల్ ఇండియా ర్యాంక్ 880, కేటగిరి ర్యాంక్ 282 సాధించాడు. దీంతో గురువారం దాండియా షఫీ నివాసంలో డాక్టర్ దాండియా మొహమ్మద్ షాకీర్ కు శ్రేయోభిలాషులు, మిత్రులు,కుటుంబ సభ్యులు, శాలువాతో సత్కరించి సన్మానించారు. అనంతరం స్వీట్లు తినిపించి అభినందించారు.ఈ కార్యక్రమంలో గుత్తి జామియా మసీదు మాజీ కార్యదర్శి మహబూబ్ బాషా, దాండియా జాబీర్, వెల్డింగ్ షేక్షావలి, రహంతుల్లా, జావీద్, ఆసీఫ్, నిజాం, తదితరులు పాల్గొన్నారు.